రాంపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలోని సిరి మల్టీ హాస్పిటల్ మేనేజింగ్ చైర్మన్ వరకాల పెంటయ్యగౌడ్ సహకారంతో లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కమలానగర్ గ్రేటర్, స్పందన డిస్ట్రిక్320సి ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. మహిళలకు రొమ్ము కేన్సర్, ఓరల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, దంత సమస్యల కోసం ఉచితంగా నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో బొడ్డుపల్లి ఉపేంద్ర, హరీష్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ఇన్నారెడ్డి, విశ్వేశ్వరరావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరి అనే నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందజేశారు.

ఉద్యోగకల్పన శిక్షణ నిమిత్తం దరఖాస్తుల స్వీకరణ

కీసర: దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కార్యక్రమాలను అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 9వ తేదీన కీసర మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తామని ఎంపీడీఓ గ్యామ తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్, అకౌంట్స్ అసిస్టెంట్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, ఆటోమొబైల్, 2 వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎల్రక్టానిక్ వస్తువుల రిపైర్ తదితర విభాగాల్లో మూడు నెలల నుంచి ఐదు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, గ్రామీణ ప్రాంతవాసులైన వారు అర్హులన్నారు.


ఆర్టీసీ డిపోలో రెండో రోజు వనభోజనాలు



వనభోజన కార్యక్రమంలో జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కార్మికులు, డిపో అధికారులు రెండో రోజు వనభోజన కార్యక్రమాలను నిర్వహించారు. రెండు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించి ఆటపాటలతో కార్మికులు ఉల్లాసంగా గడిపారు. ఉద్యోగుల ప్రశాంతత, మానసిక ఉత్తేజం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రుశాఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత, డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు, ఏఈ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

నేడు గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతర



మేడ్చల్: ప్రతి సంవత్సరం మొదటి ఆదివారం ఘనంగా నిర్వహించే గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతరను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం మొదటి ఆదివారం గిర్మాపూర్ శివార్లలోని గుట్టలలో నెలకున్న మల్లన్న స్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా బోనాల సమర్పణ, పోతరాజుల నృత్యాలు, తొట్టెల ఊరేగింపులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వందలాది మంది భక్తులు హాజరయ్యే జాతరలో భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఘట్‌కేసర్: ప్రతాపసింగారం జెడ్పీ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక రోజు అధ్యాపకులుగా మారి తరగతి గదుల్లో పాఠ్యాంశాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల నిర్వాహణపై అవగాహన కల్పించడానికి స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఎమ్మెల్యే మల్లారెడ్డి పాలకవర్గసభ్యులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కలిశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కడంతో అందుకు అన్ని విధాలా సహకారం అందించిన మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, బాలరాజ్, రజితవెంకటేశ్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి పీహెచ్‌సీలో వసతులపై ఆరా



పీహెచ్‌సీని సందర్శించిన అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

శామీర్‌పేట్: మూడు చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వసతులు, పరికరాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహపూరితంగా వ్యవహరించాలని, వారికి సత్వర వైద్యం అందించేందుకు కృషిచేయాలని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సూచించారు.

ప్రజాపాలన సక్సెస్..

- ఆరు గ్యారంటీలకు 7.09 లక్షల దరఖాస్తులు
- అందులో కొత్త రేషన్‌కార్డుల కోసం 2.03 లక్షలు
- కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణతో ప్రజాపాలన సభలు సక్సెస్
- ఈ నెల 17 వరకు దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నమోదు





సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలకు ప్రజల నుంచి భారీగా స్పందన లభించింది. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 28 నుంచి శనివారం వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు, 61గ్రామ పంచాయతీల్లో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన సభలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై అర్హులైన ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున 7.09 లక్షల దరఖాస్తులు పెట్టుకున్నారు. అందులో కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 2.03 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు పెట్టుకోవడానికి అవసరమైన పత్రాలను జతపర్చడానికి దరఖాస్తుదారులు పలుచోట్ల జిరాక్సు కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వచ్చింది. దరఖాస్తు విధానంపై అవగాహన లేనివారు పలువురికి సభల్లో సిబ్బంది సహకారం అందించారు.

సభల సక్సెస్‌కు ప్రత్యేకాధికారులే..

గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజాపాలన కార్యక్రమం, సభలు విజయవంతానికి కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో ప్రత్యేక అధికారులు కీలక పాత్ర నిర్వహించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ ఆఫీసర్ జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఉప్పల్‌లో యువజన, క్రీడా విభాగం అధికారి బలరామారావు, కుత్బుల్లాపూర్‌లో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురామ్, కూకట్‌పల్లిలో ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, మల్కాజిగిరిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ ప్రజాపాలన సభల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. సభల సక్సెస్‌లో 306 టీమ్‌లు పూర్తి భాగస్వామ్యాన్ని పంచుకున్నాయి. జిల్లాలోని 61 గ్రామ పంచాయతీలకు 10 టీమ్‌లు, 13 పురపాలక సంఘాల పరిధిలోని 289 వార్డులు/డివిజన్లకు 296 టీమ్‌లు దరఖాస్తు దారులకు అన్ని విధాలుగా సహకరించారు. తహసీల్‌దార్లు, ఎంపీడీఓలు కూడా ప్రజాపాలన విజయవంతంలో కీలక భూమిక పోషించారు.

అభయ హస్తం దరఖాస్తులు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాల పరిధిలో 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీలు, 12 మున్సిపల్ సర్కిళ్లలో 8 రోజుల వ్యవధిలో 7.09 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో అభయహస్తంలో అవకాశం లేకున్నా.. ప్రజాపాలన సభల్లో రేషన్ కార్డులు, ధరణి రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను ప్రజలు చేసుకున్నారు. అధికంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది రేషన్‌కార్డుల కోసం తెల్లకాగితంతోపాటు జిరాక్స్ సెంటర్లలో లభించే దరఖాస్తు పత్రాలతో ఆర్జీలు పెట్టుకున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 2.03 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

17 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు కలెక్టర్ ఆదేశం

ఈ నెల 17 వరకు దరఖాస్తుదారుల పూర్తి వివరాలు(సమాచారం) ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలనలో దరఖాస్తు దారులు అందించిన ఆధార్‌కార్డు, రేషన్ కార్డు నంబర్లు, మొబైల్ నంబర్, గ్యాస్, విద్యుత్తు కనెక్షన్ వివరాలను జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమాచారాన్ని ఎంట్రీ చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పులు దొర్లకుండా ఒకటికి, రెండుసార్లు సరి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని నిత్యం పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్ స్పెషల్ ఆఫీసర్లు, టీమ్‌లు నిర్విరామంగా పనిచేసేలా పటిష్ట చర్యలు చేపట్టారు.

మల్కాజ్‌గిరి డీసీపీకి అభినందనలు



ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి జోన్ నూతన డీసీపీగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ పద్మజను ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి ఆమె కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

హైటెక్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్: పట్టణంలోని హైటెక్ స్కూల్‌లో ఘనాపూర్ మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు పిల్లలకు వివరించారు. పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడిసిటి వైద్యులు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



కీసరగుట్టలో రెడ్డి సంక్షేమ భవన నిర్మాణ భూమిపూజలో రెడ్డి సంక్షేమ సంఘం నేతలు

కీసర: ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానం సన్నిధిలో కీసరగుట్ట రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కీసరగుట్ట రెడ్డి సంక్షేమ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్థలదాత గుర్రం మల్లారెడ్డితో పాటు పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, కీసర మండల వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రామిడి విజయ్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు గుర్రం లక్ష్మారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందాడి సత్తిరెడ్డి, సంఘం సభ్యులు నల్ల మధుసూదన్‌రెడ్డి, రామిడి సుధాకర్‌రెడ్డి, చర్లపల్లి కృష్ణారెడ్డి, పినింటి కృష్ణారెడ్డి, రామిడి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మేడ్చల్, బాలానగర్ స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటీ) డీసీపీగా శనివారం బాధ్యతలు చేపట్టిన డి.శ్రీనివాస్

పల్లకీ సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



పోచారం: యంనంపేట్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం నిర్వహించిన పల్లకీ సేవలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయకస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ పాలకవర్గంతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ఉపాధి ఆధారిత సాంకేతికతలో ఉచితంగా శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం, ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



దమ్మాయిగూడ అహ్మద్‌గూడలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్లు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, ఆయా గ్రామాల సర్పంచులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో అప్‌లోడ్‌చేయడం జరుగుతుందని జిల్లా పంచాయతీరాజ్ అధికారి(డీపీఓ) రమణమూర్తి, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కీసర మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైస్ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, ఎంపీడీఓ గ్యామనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న డీపీఓ రమణమూర్తి, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

ముగిసిన ప్రజాపాలన

మేడ్చల్: ప్రభుత్వం అందజేయనున్న ఆరు గ్యారంటీల కోసం అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజాపాలన పేరుతో నిర్వహించిన సభలు శనివారంతో ముగిశాయి. అభయహస్తం పేరుతో రూపొందించిన పత్రాలను ప్రజలు నింపి అధికారులకు ఇచ్చి రసీదులు తీసుకున్నారు. మండలంలో ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ, పట్టణంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు గ్రామ సభలను పర్యవేక్షించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 10,881 అభయహస్తం దరఖాస్తులు, 2,739 ఇతర దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. మండలంలో 10,508 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. గ్రామసభల్లో దరఖాస్తు ఫారాలను ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో గ్యారంటీలను అమలు చేస్తుందని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. చౌదరిగూడలో సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన శనివారం ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యుడు లక్ష్మణ్‌గౌడ్, మాజీ సభ్యులు నర్సింగ్‌రావు ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, నర్సింహ, స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు కట్ట జానార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి హాజరయ్యారు. మున్సిపాలిటీలో రెండెకరాల స్థలంలో రెడ్డి సంక్షేమ సంఘం భవనాన్ని అందరి సహకారంతో నిర్మించుకుందామని, పేద రెడ్డి విద్యార్థులకు సంఘం అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు విక్రాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి, కోశాధికారి జైపాల్‌రెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనురాధ, వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



మేడ్చల్‌రూరల్: మండల రోజుల దీక్ష చేసిన అయ్యప్ప స్వాములు శనివారం ఇరుముడి కట్టుకుని శబరియాత్రకు తరలివెళ్లారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని అయ్యప్ప దేవాలయంలో స్వాములు మణికంఠుడికి ప్రత్యేక పూజల అనంతరం గురుస్వాములు మాధవచారి, మల్లారెడ్డి, శశికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరియాత్రకు పయనమయ్యారు.

తాగునీటి సరఫరా ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గ్రాండ్ వ్యూ విల్లాస్‌లో హెచ్ఎంటీ బీఎస్ నుంచి తాగునీటి సరఫరా పైప్‌లైన్‌ను శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి పూజలు చేసి ప్రారంభించిన మల్లారెడ్డి స్థానికులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు సరస్వతి, మల్లిఖార్జున్, బాలరాజ్, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

38 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్న ఎస్ఐ మురళీధర్

మేడ్చల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న 38 కిలోల గంజాయిని శుక్రవారం రాత్రి మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన ఉత్తమ్‌చౌదరి, నాతరామ్‌లు కొంతకాలంగా కిష్టాపూర్‌లో నివాసం ఉంటూ అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో శుక్రవారం నగరంలోని ఎంజీబీఎస్ వద్ద 38 కిలోల గంజాయిని ఇతరుల వద్ద తీసుకున్న ఉత్తమ్‌చౌదరి, నాతరామ్‌లు కిష్టాపూర్ తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించి వారిని పట్టుకున్నారు. గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు

జవహర్‌నగర్: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ సిబ్బందితో కూల్చివేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కొనసాగుతున్న రాములోరి అక్షింతల వితరణ



అత్వెల్లిలో అక్షింతలను అందజేస్తున్న నాయకులు



రాములోరి అక్షింతలకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

మేడ్చల్: అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వివిధ వార్డుల్లో జోరుగా కొనసాగుతోంది. అయోధ్య ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. గ్రామంలో ఊరేగించి హనుమాన్ ఆలయంలో ఉంచిన అక్షింతలను ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. మేడ్చల్, అత్వెల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ తదితర గ్రామాల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నాయకులు అక్షింతల వితరణను జోరుగా నిర్వహిస్తున్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

ఘట్‌కేసర్: ఘనాపూర్ పంచాయతీ పకీర్ టెక్యా తండాలో అయోధ్య రాముడి అక్షింతలకు శనివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్షింతలతో పాటు శ్రీరాముడి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, రామమందిరం చిత్రపటం, కరపత్రం అందజేశారు.